నమస్తే తెలంగాణ
మెదక్
13 | హైదరాబాద్, మంగళవారం 6 ఫిబ్రవరి 2024 | MEDAK

హుస్నాబాద్: సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీని దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మెదక్ కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

కేసీఆర్‌ను దూషిస్తే ఖబడ్దార్

సీఎం రేవంత్ తీరును నిరసిస్తూ ధర్నా, రాస్తారోకో

హుస్నాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీని దహనం చేసిన బీఆర్ఎస్ నాయకులు

హుస్నాబాద్, ఫిబ్రవరి 5: సీఎం రేవంత్‌రెడ్డి అసభ్య పదజాలంతో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను దూషించడాన్ని నిరసిస్తూ సోమవారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలోని అక్కన్నపేట చౌరస్తాలో బీఆర్ఎస్ నాయకులు ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీని దహనం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ శ్రేణులు మాట్లాడుతూ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా తెలంగాణ రాష్ట్రాన్ని తెచ్చిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై సీఎం రేవంత్‌రెడ్డి ఇష్టమొచ్చినట్లు మాట్లాడటం సరికాదన్నారు. ఇప్పటికైనా నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలని హితవుపలికారు. తొమ్మిదేండ్లలో తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందు వరుసలో నిలిపిన గొప్ప నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి కాగానే అహం పెరిగిందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చి ప్రజా సంక్షేమం కోసం పనిచేయాలని రేవంత్‌రెడ్డికి సూచించారు. భవిష్యత్‌లో ఇటువంటి వ్యాఖ్యలు చేస్తే ప్రజలు, బీఆర్ఎస్ కార్యకర్తలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, వైస్‌చైర్‌పర్సన్ అయిలేని అనిత, బీఆర్ఎస్ పట్టణ, మండల శాఖ అధ్యక్షులు ఎండీ అన్వర్, వంగ వెంకట్రామ్‌రెడ్డి, మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎడబోయిన తిరుపతిరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ సుద్దాల చంద్రయ్య, నాయకులు అయిలేని మల్లికార్జున్‌రెడ్డి, వాల నవీన్, గందె చిరంజీవి, పోలవేని సంపత్, చిట్టి గోపాల్‌రెడ్డి, బొల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఇష్టపడి చదవండి..

పదో తరగతి ఫలితాలపైనే భవిష్యత్తు

పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

విద్యార్థులకు మోటివేషనల్ తరగతులు

గడ్డపోతారంలో పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పరీక్షా సామగ్రి అందిస్తున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

జిన్నారం, ఫిబ్రవరి 5: ప్రతి విద్యార్థి జీవితంలో 10వ తరగతి పరీక్షలు అత్యంత కీలకమని, ఇష్టపడి చదివి లక్ష్యాన్ని సాధించాలని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. సోమవారం జిన్నారం మండలం గడ్డపోతారంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి సహకారంతో జిన్నారం, గుమ్మడిదల మండలాలతోపాటు బొల్లారం మున్సిపల్ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు మానసిక వ్యక్తిత్వ నిపుణుడు డాక్టర్ సతీశ్‌తో మోటివేషనల్ తరగతులు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే సొంత నిధులతో కొనుగోలు చేసిన స్టడీ మెటీరియల్, పరీక్షా ప్యాడ్లు, పెన్నులను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ ఏర్పడిన తర్వాత మాజీ సీఎం కేసీఆర్ నాయకత్వం విద్యారంగంలో ఎన్నో విప్లవాత్మక మార్పులు వచ్చాయని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 1000కి పైగా గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేసి పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించారని తెలిపారు. పరీక్షలు పూర్తయ్యే వరకు విద్యార్థులంతా మొబైల్ ఫోన్లకు దూరంగా ఉండాలని, తల్లిదండ్రులు పూర్తి సహకారం అందించాలని కోరారు. పదో తరగతి ఫలితాలపైనే భవిష్యత్తు ఆధారపడి ఉంటుందన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. అనంతరం వ్యక్తిత్వ వికాస నిపుణుడు డాక్టర్ పూర్ణ కృష్ణ, సోను, ప్రసన్న కుమార్, ఎంఈవో రాథోడ్ ఒత్తిడిని అధిగమించే మెళకువలను విద్యార్థులకు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్‌చైర్మన్ ప్రభాకర్, గుమ్మడిదల జడ్పీటీసీ కుమార్ గౌడ్, ఎంఈవో జెమినీ కుమారి, సీనియర్ నాయకులు విజయభాస్కర్ రెడ్డి, వెంకటేశ్ గౌడ్, ప్రజాప్రతినిధులు, విద్యార్థినీవిద్యార్థులు పాల్గొన్నారు.

సిద్దిపేట జిల్లా నర్మెట ఆయిల్ పామ్ ఫ్యాక్టరీలో వాటర్ స్టోరేజీ నిర్మాణ పనులు

చకచకా.. ఫ్యాక్టరీ పనులు

సిద్దిపేట జిల్లా నర్మెటలో రూ.300 కోట్లతో ఆయిల్‌పామ్ కర్మాగారం నిర్మాణం

సిద్దిపేట జిల్లా అక్కనపల్లిలో రైతు నాగేందర్ ఆయిల్‌పామ్‌తోటలోని గెలలు

- జూన్ నుంచి తొలి క్రాప్ కొనుగోలు
- ముమ్మరంగా వాటర్ స్టోరేజీ, వే బ్రిడ్జీ, పాలన గది తదితర పనులు
- కేసీఆర్ ప్రభుత్వం భరోసాతో సాగుకు ముందుకొచ్చిన రైతులు
- క్షేత్రస్థాయిలో పనులను పరిశీలించి తగు సూచనలు చేసిన మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు

సిద్దిపేట జిల్లా నర్మెట ఫ్యాక్టరీ నిర్మాణంలో భాగంగా వాటర్ స్టోరేజీ పనులను పరిశీలిస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు (ఫైల్)

సిద్దిపేట, ఫిబ్రవరి 5 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): సిద్దిపేట జిల్లా నర్మెట గ్రామ శివారులో 62 ఎకరాల విస్తీర్ణంలో రూ.300 కోట్లతో టీఎస్ ఆయిల్ ఫెడ్ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి. 2023 సెప్టెంబర్‌లో ఫ్యాక్టరీ నిర్మాణ పనులు ప్రారంభంకాగా, ఏప్రిల్ 2025 నాటికి పూర్తి చేసే లక్ష్యంగా పెట్టుకున్నారు. మూడేండ్ల క్రితం ఆయిల్‌పామ్ పంటసాగు చేసిన రైతులు పంట గెలలను ఇప్పటి వరకు వదిలి పెట్టారు. నాలుగో పంట దిగుబడి జూన్ వరకు రానున్నది. ఇటీవల మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు ఫ్యాక్టరీ నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి తగు సూచనలు, సలహాలు చేశారు. అత్యాధునిక టెక్నాలజీని ఉపయోగించి ఫ్యాక్టరీ నిర్మాణం చేస్తున్నారు. నూనె ఉత్పత్తి చేయడమే కాకుండా రిఫైనరీని మొదలు పెట్టి ఫైనల్ ప్రొడక్ట్‌ను ఇక్కడి నుంచే నేరుగా మార్కెట్‌లోకి పంపించే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. నాలుగు మెగా వాట్ల సెల్ఫ్ జనరేషన్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నారు. వాడిన నీటిని వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ ద్వారా రీసైకిల్ చేసే పద్ధతిని ఇక్కడ పెడుతున్నారు. రైతుల పొలాల నుంచి నర్మెట ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ వరకు తేవడానికి అవసరమైన రవాణా ఖర్చును కూడా రాష్ట్ర ఆయిల్‌ఫెడ్ వారు భరిస్తారు. పంటరాగానే రైతుల వద్ద కొనుగోలు చేసి వారానికి రెండు రోజులు రైతులకు డబ్బుల చెల్లింపులు చేస్తారు. ప్రస్తుతం ఫ్యాక్టరీ నిర్మాణ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నప్పటికీ పూర్తికావడానికి మరో ఏడాది పట్టే అవకాశం ఉంది. రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా జూన్ నుంచి ఇక్కడే తొలి పంట దిగుబడి కొనుగోలు చేస్తారు. ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ వారు కొన్న పంటను ఆశ్వరావుపేటకు తీసుకుపోయి అక్కడ ప్రాసెస్ చేస్తారు. సంవత్సరంలోగా ఫ్యాక్టరీ పనులు పూర్తి చేసుకున్న తర్వాత ఇక్కడనే రిఫైనరీ ద్వారా నూనె ఉత్పత్తిని చేస్తారు. ప్రస్తుతం ఫ్యాక్టరీ నిర్మాణ పనుల్లో భాగంగా 10 కోట్ల లీటర్లు పట్టే వాటర్ స్టోరేజీ ట్యాంకు, మూడు వే బ్రిడ్జీలు, ప్రహరీ, పరిపాలన భవనం, మెకానికల్ పనులు జరుగుతున్నాయి.

అత్యాధునిక టెక్నాలజీ..

ఫ్యాక్టరీలో మొదట గంటకు 30 టన్నుల గెలల క్రషింగ్ సామర్థ్యంతో నిర్మాణం పూర్తవుతుంది. గెలల పరిమాణం, సామర్థ్యం పెరుగుతున్న కొద్దీ క్రషింగ్ సామర్థ్యాన్ని గంటకు 120 టన్నులకు పెంచుకునే వీలును ముందుగానే ఏర్పాటు చేసుకుంటున్నారు. గంటకు 120 టన్నుల గెలల క్రషింగ్ సామర్థ్యంతో ఫ్యాక్టరీ నిర్మాణం కావడం భారతదేశంలోనే తొలిసారి అని చెప్పవచ్చు. నర్మెట ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ భవిష్యత్‌లో ఒక సిద్దిపేట జిల్లాలోని ఆయిల్‌పామ్ గెలలకు మాత్రమే కాకుండా సమీప జిల్లాలైన జనగామ, మహబూబాబాద్, గద్వాల్, నారాయణపేట, యాదాద్రి-భువనగిరి జిల్లాల ఆయిల్‌పామ్ గెలలను ప్రాసెస్ చేసేందుకు అత్యాధునిక సామర్థ్యంతో మలేషియా టెక్నాలజీతో నిర్మిస్తున్నారు.

వివిధ దశల్లో ఉన్న నిర్మాణ పనులు

ఫ్యాక్టరీ నిర్మాణంలో భాగంగా ..

1) క్రూడ్ పామాయిల్ మిల్లు
2) పామ్ కెర్నల్ ఆయిల్ మిల్లు
3) విద్యుత్ ఉత్పత్తి కోసం కో జనరేషన్ ప్లాంట్
4) వ్యర్థాల రిసైక్లింగ్ కోసం కండెన్సేషన్ ప్లాంటు
5) క్రూడ్ పామాయిల్‌ను రిఫైనరీ చేయడానికి మిల్లు
6) ఇతర మిల్లింగ్ పనులు

ఆరు జిల్లాల పరిధిలో 38,866 ఎకరాల సాగు

అంతర సేద్యం లేదా పంట మార్పిడి ద్వారా ఒక రైతు తన పొలంలో ఒకటి కంటే ఎక్కువ పంటలు పండించడం పంట వైవిధ్యంగా చెప్పవచ్చు. ఈ విధానం ద్వారా అధిక ఆదాయం పొందే అవకాశం ఉంది. ఆయిల్‌పామ్‌కు జాతీయ మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉండడం...గత కేసీఆర్ ప్రభుత్వ ప్రోత్సాహం..ఆయిల్‌పామ్ సాగు చేయడానికి పెద్ద ఎత్తున రైతులు ముందుకు వచ్చారు. రాష్ట్రంలో ఖమ్మం, కొత్తగూడెం జిల్లాల తర్వాత కొత్తగా సాగు చేస్తున్న జిల్లాలో సిద్దిపేట జిల్లా అగ్రస్థానంలో ఉంది. నర్మెట ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ పరిధిలో నూతనంగా ఏర్పడిన సిద్దిపేట జిల్లాతో పాటు జనగామ, యాదాద్రి- భువనగిరి, మహబూబాబాద్, గద్వాల్, నారాయణపేట జిల్లాలు వస్తాయి. 2020-21 నుంచి 2023-24 వరకు (ఇప్పటివరకు) అన్ని జిల్లాలో కలిపి 38,866 ఎకరాలు ఆయిల్‌పామ్ పంట సాగు చేశారు. సిద్దిపేట జిల్లాలో 10,962 ఎకరాలు, జనగామ జిల్లాలో 5,798 ఎకరాలు, యాదాద్రి-భువనగిరి జిల్లాలో 3,385 ఎకరాలు, మహబూబాబాద్ జిల్లాలో 6,668 ఎకరాలు, గద్వాల్ జిల్లాలో 6026 ఎకరాలు, నారాయణపేట జిల్లాలో 6027 ఎకరాలు ఆయిల్‌పామ్ మొక్కలు నాటినట్లు అధికారులు తెలిపారు. వీటిలో మొదటి ఏటా 870 ఎకరాలు, రెండో ఏటా 6610 ఎకరాలు, మూడో ఏటా 19,771 ఎకరాలు, నాలుగో ఏటా 11,615 ఎకరాలు మొత్తం ఆరు నూతన జిల్లాల పరిధిలో 8150 మంది రైతులు 38,866 ఎకరాల్లో ఆయిల్‌పామ్ మొక్కలు నాటారు.

ఆరు జిల్లాల్లో ఆయిల్‌పామ్ సాగు ఎకరాల్లో..

జిల్లా పేరు	2020-21	2021-22	2022-23	2023-24	మొత్తం
సిద్దిపేట	నిల్	2,773	5,560	2,629	10,962
జనగామ	నిల్	426	3,210	2,162	5,798
యాదాద్రి	నిల్	నిల్	1,427	1,958	3,385
మహబూబాబాద్	305	701	3,790	1,872	6,668
గద్వాల్	252	1,479	2,862	1, 433	6,026
నారాయణపేట	313	1,231	2,922	1,561	6,027
మొత్తం	**870**	**6,610**	**19,771**	**11,615**	**38,866**

జూన్ నుంచి తొలి క్రాప్ కొనుగోలు

నర్మెట ఫ్యాక్టరీ వద్ద జూన్ నుంచి ఆయిల్ పామ్ గెలల కొనుగోలు షురూ కానుంది. సంప్రదాయ నూనె గింజల ఆయిల్‌పామ్ పంట నూనే దిగుబడి 4 నుంచి 5 రెట్లు అధికంగా ఉంటుంది. మొక్కలు నాటిన తర్వాత నాలుగో సంవత్సరం నుంచి కాపు మొదలై 30 ఏండ్ల వరకు నిరంతర దిగుబడితోపాటు ఆదాయం వస్తుంది. తెగుళ్లు, చీడ పీడలు ఇతర పంటలతో పోలిస్తే ఆయిల్‌పామ్‌లో చాలా తక్కువ. ఈ పంట ప్రకృతి వైపరీత్యాలను సమర్థవంతంగా తట్టుకుంటుంది. కోతులు, అడవి పందుల బెడద ఉండదు. ఇతర పంటల మాదిరిగా ధాన్యాన్ని ఆరబెట్టడం, తూర్పార పట్టడం, తేమ శాతం నిలవడం లాంటి సమస్యలు ఆయిల్‌పామ్‌లో లేవు. దళారీ వ్యవస్థ అసలే ఉండదు. రైతు గెలలు కోసిన తర్వాత నేరుగా ఫ్యాక్టరీకి తరలించి మూడు రోజుల్లో గెలలు, రవాణా చార్జీలు పొందే అవకాశం ఉంటుంది. ఆయిల్‌పామ్ సాగు వల్ల నిరంతర దిగుబడి, ఆదాయంతో రైతుల ఆర్థిక పురోగతి, అత్యున్నత దశకి చేరుకొని రైతు మాత్రమే కాకుండా రైతు భావితరాలు కూడా ఆయిల్‌పామ్ లబ్ధిపొందే అవకాశం. ఇతర పంటలో పోలిస్తే ఖర్చులపోను అయిల్‌పామ్ సాగు వల్ల ఏడాదికి ఎకరాకు నికరంగా రూ.1,00,000 ఆదాయం వస్తుంది. మొదటి మూడేండ్లు ఆదాయం కోసం అంతర పంటలుగా కూరగాయలు, మొక్కజొన్న ,పత్తి ,బొబ్బెర్లు, పెసర్లు, కందులు, ఉలువలు పొద్దుతిరుగుడు, అరటి, బొప్పాయి, వేరుశనగ లాంటి పంటలు పండించవచ్చు. ఐదేండ్ల తర్వాత కూడా అంతర పంటలుగా కోకో, పొట్టి మిరియాలు మొదలగు సాగుచేసి అదనపు ఆదాయం పొందే అవకాశం ఉంది.

సమస్యలు పరిష్కరించాలి

సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 5: ఉన్నతాధికారులు నేరుగా ప్రజల సమస్యలు విని పరిష్కరించడానికి మొదలు పెట్టిన గొప్ప కార్యక్రమం ప్రజావాణి అని సిద్దిపేట అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ అన్నారు. సిద్దిపేట కలెక్టరేట్‌లో సోమవారం అర్జీదారుల నుంచి ఆమె ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లా నలుమూలల నుంచి సమస్యలు నేరుగా విన్నవించి పరిష్కరించుకోవడానికి అర్జీదారులు ఎంతో ఆశతో కార్యాలయానికి వస్తారని.. వారందరికీ న్యాయం చేయడం మన కర్తవ్యమని అధికారులకు సూచించారు. అర్జీదారుల నుంచి తీసుకున్న ఫిర్యాదులు త్వరగా పరిష్కరించి నివేదిక అందజేయాలన్నారు అర్జీదారులకు ప్రజావాణి కార్యక్రమంపైన నమ్మకం పెరిగిందన్నారు. క్రమక్రమంగా అర్జీదారుల సంఖ్య పెరుగుతుండడంతో అధికారులు ఎంతో ఉత్సాహంతో పనిచేయాలన్నారు. వివిధ సమస్యలపై మొత్తం 28 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌వో నాగరాజమ్మ, డీఆర్‌డీఏ పీడీ జయదేవ్‌ఆర్యా, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మెదక్‌లో 98 అర్జీలు..

మెదక్, ఫిబ్రవరి 5 (నమస్తే తెలంగాణ): సమస్యల పరిష్కారానికే ప్రజావాణి కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని మెదక్ కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా 98 మంది నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజావాణిలో వచ్చిన సమస్యలను వెంట వెంటనే పరిష్కరించే విధంగా ఆయా శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రమేశ్, డీఆర్‌వో పద్మశ్రీ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సంగారెడ్డిలో 75 అర్జీలు..

సంగారెడ్డి కలెక్టరేట్, ఫిబ్రవరి 5 : ప్రజావాణికి వచ్చే అర్జీలను సత్వరమే పరిష్కరించాలని సంగారెడ్డి అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాలులో నిర్వహించిన ప్రజావాణికి జిల్లా నలుమూలల నుంచి 75 అర్జీలు వచ్చాయి. కార్యక్రమంలో డీఆర్వో నగేశ్, ఏవో పరమేశ్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ప్రదర్శనకు ఐదు ప్రాజెక్టులు

ఫలితాలు వెల్లడిస్తున్న డీఈవో రాధాకిషన్, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి

మెదక్ మున్సిపాలిటీ, ఫిబ్రవరి 5: రాష్ట్ర విద్యాపరిశోధన శిక్షణా సంస్థ, నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ ఆదేశాల మేరకు వర్చువల్ పద్ధతిలో నిర్వహించిన జిల్లాస్థాయి ఇన్‌స్పైర్ ప్రదర్శనల్లో అత్యుత్తమంగా నిలిచిన 5 ప్రాజెక్టులు రాష్ట్రస్థాయి ప్రదర్శనకు ఎంపికైనట్లు మెదక్ జిల్లా విద్యాశాఖాధికారి రాధాకిషన్, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి సోమవారం విలేకరులకు తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ హుస్సేన్ నేతృత్వంలో నిపుణుల బృందంతో పాటు ఇన్నోవేషన్ ఫౌండేషన్ శాస్త్రవేత్తలు సంయుక్తంగా మూల్యాంకనం చేసినట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి సుదర్శనమూర్తి, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సుధాకర్, న్యాయ నిర్ణేతలు దినాకర్, తిరుమల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎంపికైన ప్రాజెక్టులు

నర్సాపూర్ మండలం బంజారానగర్ జడ్పీహెచ్ఎస్‌కు చెందిన అభిలాశ్ గౌడ్ కదిలే బహుళార్థక నిచ్చెన ప్రాజెక్టు, తూప్రాన్ కేజీబీవీకి చెందిన విద్యార్థిని శ్రావణి మత్తు పదార్థాలను గుర్తించే ఇండికేటర్ ప్రాజెక్టు రాష్ట్రస్థాయి ప్రదర్శనకు ఎంపికయ్యాయి. తూప్రాన్ కేజీబీవీ విద్యార్థిని ప్రణతి స్మార్ట్ స్కూల్ బ్యాగ్ ప్రాజెక్టు, టేక్మాల్, జడ్పీహెచ్ఎస్ విద్యార్థి విష్ణునాయక్ వ్యర్థ ప్లాస్టిక్ నుంచి ఇటుకల తయారీ, నాగ్సన్‌పల్లి జడ్పీహెచ్ఎస్ విద్యార్థి విష్ణువర్ధన్ యాంటీ తెఫ్ట్ ఏటీఎం ప్రాజెక్టులు రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాయి.

ఓపెన్ పరీక్ష ఫీజు ఆన్‌లైన్‌లో చెల్లించాలి

సంగారెడ్డి కలెక్టరేట్, ఫిబ్రవరి 5: ఉమ్మడి మెదక్ జిల్లాలో ఓపెన్ స్కూల్ విధానంలో ప్రవేశం పొంది ఏప్రిల్/మేలో నిర్వహించే పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు మీసేవ, టీఎస్ ఆన్‌లైన్‌లో మాత్రమే పరీక్ష ఫీజు చెల్లించాలని డీఈవో వెంకటేశ్వర్లు సోమవారం ప్రకటనలో తెలిపారు. గతంలో ప్రవేశం పొంది పరీక్షలకు హాజరు కాని వారు, పరీక్షలకు హాజరై ఫెయిల్ అయినవారు ఈ పరీక్షలు రాసేందుకు అర్హులని స్పష్టం చేశారు. పదో తరగతి పరీక్ష ఫీజుకు సంబంధించి ప్రతి థియరీ సబ్జెక్టుకు రూ.100, ప్రాక్టికల్‌కు రూ. 100, ఇంటర్మీడియట్ పరీక్ష ఫీజుకు సంబంధించి ప్రతి థియరీ సబ్జెక్టుకు రూ. 150, ప్రాక్టికల్‌కు రూ.150 చెల్లించాలన్నారు. ఎలాంటి అపరాధ రుసుము లేకుండా ఈనెల 12 నుంచి 21లోగా పరీక్ష ఫీజు చెల్లించాలన్నా రు. రూ.25 చొప్పున అపరాధ రుసుముతో ఈనెల 22 నుంచి 27వరకు, రూ.50 అపరాధ రుసుముతో ఈనెల 28 నుంచి మార్చి 4లోగా ఫీజు చెల్లించవచ్చన్నారు. అధ్యయన కేంద్రాల కో-ఆర్డినేటర్లు, సిబ్బంది ఈ విషయాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. అభ్యాసకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు జిల్లా ఓపెన్ స్కూల్ కో-ఆర్డినేటర్ ఎస్.వెంకటస్వామి (80084 03635)ని సంప్రదించాలన్నారు.

ప్రతిభను వెలికితీయాలి

ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి

గజ్వేల్, ఫిబ్రవరి 5: విద్యార్థుల్లో దాగిఉన్న ప్రతిభను వెలికితీయాలని, అందుకు ఉపాధ్యాయులు ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధపెట్టాలని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి అన్నారు. సోమవారం గజ్వేల్ మండల పరిధిలోని ప్రజ్ఞాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలంగాణ గణితఫోరం ఆధ్వర్యంలో జిల్లా స్థాయి గణిత ప్రతిభ పరీక్ష నిర్వహించారు. ఇందులో ప్రతి మండలం నుంచి ముగ్గురు చొప్పున విద్యార్థులు పాల్గొనగా జిల్లాస్థాయిలో ప్రతిభ చూపిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించేలా కేసీఆర్ ప్రభు త్వం 'మన ఊరు- మన బడి' ద్వారా అధిక నిధులు ఖర్చుచేసిందన్నారు. ప్రభుత్వ పాఠశాలలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించి మరింత బలోపేతం చేసి గ్రామీణ విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించేలా చూడాలన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అన్ని విధాలుగా సహరించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయల ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం నాయకుడు కరీముద్దీన్ పాల్గొన్నారు.

సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం ప్రజ్ఞాపూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి

పకడ్బందీగా ఎన్నికలు నిర్వహించాలి


సమావేశంలో మాట్లాడుతున్న భారత ఎన్నికల కమిషన్ అబ్జర్వర్ జ్యోతి బుద్ధ ప్రకాశ్

ములుగు, ఫిబ్రవరి 5: రాబోయే పార్లమెంట్ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని భారత్ ఎన్నికల కమిషన్ జిల్లా రోల్ అబ్జర్వర్ జ్యోతి బుద్ధప్రకాశ్ అధికారులను ఆదేశించారు. సోమవారం మండల కేంద్రమైన ములుగులోని అటవీ కళాశాల, పరిశోధన కేంద్రంలో కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్, ఆర్డీవో బన్సీలాల్ ఆధ్వర్యంలో గజ్వేల్ రెవెన్యూ డివిజన్ ఈఆర్‌వో, ఎఈఆర్‌వోతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల నిర్వహణపై ఆయన దిశానిర్దేశం చేశారు. అనంతరం జ్యోతి బుద్ధ ప్రకాశ్ మాట్లాడుతూ.. జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా బాధ్యతాయుతంగా పార్లమెంట్ ఎన్నికలు నిర్వహించాలని సూచించారు. నూతనంగా ఓటు హక్కు పొందినవారి జాబితాను క్షుణ్ణంగా పరిశీలించి ఆమోదించాలని ఆయన తెలిపారు. గ్రామాలు, మున్సిపాలిటీల్లో బీఎల్‌వోలు పోలింగ్ కేంద్రాల వారీగా ఆయా రాజకీయ పార్టీల నాయకులతో సమావేశాలు నిర్వహించాలన్నారు. సమావేశంలో గజ్వేల్ డివిజన్ ఈఆర్‌వో, ఏఈఆర్‌వోలు తదితరులు పాల్గొన్నారు.